క్లుప్తంగా

దుప్పట్ల పంపిణీ



దుప్పట్లు అందజేస్తున్న డీఎస్పీ రెహమాన్

కొత్తగూడెంరూరల్: లక్ష్మీదేవిపల్లి మండలం గొత్తికోయ గ్రామంలో పోలీసులు శనివారం కనెక్ట్ ప్రోగ్రాం నిర్వహించారు. ఎస్పీ రోహిత్ రాజు ఆదేశాల మేరకు గంగ్రభందం, బాసగుంపు గ్రామాల్లోని గొత్తికోయలకు డీఎస్పీ రెహమాన్ దుప్పట్లు, దోమతెరలు పంపిణీ చేశారు. పరిసర ప్రాంతాలను శుభ్రంగా ఉంచుకోవాలని, విషజ్వరాలు ప్రబలకుండా జాగ్రత్తలు పాటించాలని చెప్పారు. గ్రామంలో ఎలాంటి సమస్య వచ్చినా పోలీసుల సహాయం తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో చుంచుపల్లి సీఐ వెంకటేశ్వర్లు, లక్ష్మీదేవిపల్లి ఎస్ఐ రమణారెడ్డి తదితరులు ఉన్నారు.

కేటీపీఎస్ సొసైటీ అధ్యక్ష, కార్యదర్శులకు సన్మానం

పాల్వంచ: కేటీపీఎస్ కోఆపరేటివ్ సొసైటీ నూతన అధ్యక్ష, కార్యదర్శులుగా ఎన్నికైన ధర్మరాజుల నాగేశ్వరరావు, కేశులాల్‌ను బీసీ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ నాయకులు శనివారం కలిసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం వారిని సన్మానించారు. అసోసియేషన్ జెన్‌కో అధ్యక్షుడు కొమరవెల్లి రవీందర్, సెక్రటరీ ఆడెపు రమాకాంత్, లింగం వినోద్ బాబు, బోయిన రాంబాబు, నరేందర్, రామారావు, రామకృష్ణ, నాగరాజు, రమేశ్, దానం నరసింహారావు, మహేందర్, అనిల్‌కుమార్, సాంబమూర్తి, కోటేశ్వరరావు పాల్గొన్నారు.

ఎప్‌సెట్ కౌన్సెలింగ్‌కు 450 మంది హాజరు

సింగరేణి(కొత్తగూడెం): టీఎస్ ఎప్‌సెట్ 2024 అడ్మిషన్ల కౌన్సెలింగ్ రుద్రంపూర్‌లోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో శనివారం జరిగింది. 450 మంది అభ్యర్థులు హాజరై తమ సర్టిఫికెట్లు వెరిఫికేషన్ చేయించుకున్నారని కళాశాల ప్రిన్సిపాల్ బి.నాగముని నాయక్ తెలిపారు. రిజిస్ట్రేషన్ అయిన వారికి ఈనెల 6 నుంచి 13 వరకు స్లాట్ బుకింగ్ ఉంటుందని, 8వ తేదీ నుంచి 15వ తేదీ వరకు సర్టిఫికెట్ వెరిఫికేషన్ ఉంటుందని, అదేరోజు ఆప్షన్ సెలక్షన్, 19న సీట్ ఎలాట్‌మెంట్ ఉంటుందని తెలిపారు.

పట్టపగలు చోరీ

పాల్వంచరూరల్: పట్టపగలు జగన్నాథపురంలో తాళం వేసి ఉన్న ఇంట్లో శుక్రవారం చోరీ జరిగింది. పోలీసులు తెలిపిన వివరాలు... గ్రామానికి చెందిన సారపాక ఐటీసీలో పనిచేస్తున్న భూక్యా ధర్మ విధులకు వెళ్లాడు. భార్య ఇంటికి తాళం వేసి వ్యవసాయ పనులకు వెళ్లింది. సాయంత్రం ఇంటికి వచ్చి రాగా దొంగలు పడినట్లు గుర్తించారు. బీరువా తాళం పగలగొట్టి మంగళసూత్రం, రింగ్, చెవికమ్మలు, రూ.30వేల నగదును ఎత్తుకెళ్లినట్లు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎస్ఐ శ్రీనివాస్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కాపర్‌వైర్.... రెండు విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లకు చెందిన కాపర్‌వైర్లను దొంగలు ఎత్తుకెళ్లారు. వివరాలు... జగన్నాథపురం గ్రామ శివారులోని బానోతు వీరూ, సపావత్ బాబులకు చెందిన ట్రాన్స్‌ఫార్మర్లను గుర్తుతెలియని వ్యక్తులు పగలగొట్టి అందులో ఉన్న రూ.20వేల విలువ గల కాపర్‌వైర్‌ను ఈనెల 4న చోరీ చేశారని లైన్‌మెన్ బానోతు తులిస్యా శనివారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎస్ఐ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బ్యాటరీలు...

పాల్వంచ: బీఎస్ఎన్ఎల్ సిగల్స్ బ్యాటరీల చోరీ జరిగింది. పోలీసుల కథనం మేరకు.. పట్టణంలోని బీకాలనీలో బీఎస్ఎన్ఎల్ సిగల్స్ పాయింట్ వద్ద బ్యాటరీ సెట్‌లు ఈనెల 4న రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు చోరీకి పాల్పడ్డారు. గుర్తించిన టెక్నీషియన్ కల్యాణ్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోద్ చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ బి.రాము తెలిపారు.

కేసు నమోదు

పాల్వంచ: కిరాణా షాపు ధ్వంసం చేసిన వ్యక్తిపై పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాలు.. కేఎస్‌పీ రోడ్డులో కేటీపీఎస్ మెటీరియల్ గేటు ఎదుట సీతారంపట్నంకు చెందిన జానకమ్మ కిరాణా షాపు నడుపుకుంటూ జీవనం సాగిస్తోంది. జూన్ 26న చంద్రుగొండ మండలం సీతాయిగేగూడెంకు చెందిన యడ్ల మోహన్‌రావు వచ్చి ఈ స్థలం నాదేనని షాపు గోడలను ధ్వంసం చేశాడు. ఈ విషయమై పెద్ద మనుషుల సమక్షంలో న్యాయం కోసం మాట్లాడగా... పరిష్కారం కాలేదు. జానకమ్మ ఫిర్యాదు మేరకు శనివారం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గుండెపోటుతో విద్యార్థి మృతి

చుంచుపల్లి: గుండెపోటుతో ఏడో తరగతి విద్యార్థి మృతి చెందిన ఘటన శనివారం కొత్తగూడెంలో జరిగింది. సుజాతనగర్ మండలం సర్వారం గుడితండాకు చెందిన తేజావత్ హరికృష్ణ(13) విద్యానగర్‌లోని ఓ ప్రైవేట్ పాఠశాలలో చదువుతున్నాడు. శనివారం స్కూల్‌కు వచ్చిన కాసేపటికే ఛాతిలో నొప్పి రావడంతో కొత్తగూడెం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఈ క్రమంలో పరీక్షించిన వైద్యులు అప్పటికే హరి మృతి చెందాడని నిర్ధారించారు. కాగా హరికృష్ణ చిన్నతనం నుంచే గుండె సమస్యతో బాధపడుతున్నట్లు తెలిసింది.

పొంచి ఉన్న ప్రమాదం

- రోడ్లపై వాహనాలకు అడ్డుగా పశువులు
- గోశాలకు తరలించడంలో నిర్లక్ష్యం..
- ఇబ్బంది పడుతున్న వాహనదారులు



రామవరం ఏరియాలో రోడ్డుపై ఆవులు

కొత్తగూడెంఅర్బన్: జిల్లా కేంద్రం కొత్తగూడెంలోని పలు ప్రాంతాల్లో రోడ్లపై పశువులు తిష్టవేయడంతో ప్రమాదాలకు కారణం అవుతున్నాయి. గతంలో జరిగిన పలు రోడ్డు ప్రమాదాల్లో ప్రాణనష్టం జరిగిన సంఘటనలున్నాయి. ప్రమాదాలు జరిగినప్పుడు మాత్రమే మున్సిపల్ అధికారులు స్పందించి పశువులను గోశాలకు తరలిస్తున్నారు. ఆ తరువాత ఎవరూ పట్టించుకోవడం లేదు. యజమానుల ఇళ్ల నుంచి రోడ్లపైకి వచ్చి వాహనాలకు అడ్డుగా ఉంటున్నాయి. వాటిని యజమానులు కానీ, మున్సిపల్ సిబ్బంది కానీ పట్టించుకోవడం లేదు. రోడ్లపై ఉంటున్న పశువుల సమాచారాన్ని సంబంధిత యజమానులను గుర్తించి వారికి నోటీసులు జారీ చేసి కొన్ని రోజుల గడువును ఇచ్చి ఆ తరువాత కూడా యజమానులు పశువులను వారి ఇళ్లకు తీసుకెళ్లకుంటే మున్సిపల్ అధికారులు చర్యలు తీసుకోవాల్సి ఉంది. కానీ ఈ ప్రక్రియ జరగడం లేదు. దీని వలన వాహనదారులు నష్టపోతున్నారు. రాత్రివేళ రోడ్లపై పశువులు కనిపించకపోవడం వలన భారీ వాహనాలు పల్టీలు కొట్టిన సందర్భాలు ఉన్నాయి. దీంతోపాటు పశువులు రోడ్డుకు అడ్డంగా పడుకోవడం, రోడ్లపై అటు, ఇటు తిరగడం వలన వాహనదారులు, పాదచారులు ఇబ్బంది పడుతున్నారు.

జాతీయ రహదారులు, ప్రధాన రోడ్లపైనే...

కొత్తగూడెం జిల్లా కేంద్రంతో పాటు, జాతీయ రహదారి ఉన్న రుద్రంపూర్, రామవరం, హెడ్డాఫీసు సెంటర్, సూపర్‌బజార్ సెంటర్, గణేష్ టెంపుల్ నుంచి ఇల్లెందు క్రాస్ రోడ్డు వరకు కూడా రోడ్లపై పశువుల సంచారం ఎక్కువగా ఉంది. రామవరంలోని గోధుమవాగు బ్రిడ్జి, సింగరేణి ఉమెన్స్ కళాశాల హాస్టల్, కళాశాల వద్ద ఎక్కువగా రోడ్లపై పశువులు ఉంటున్నాయి. రామవరంలో హాస్టల్ ఉన్న ప్రాంతంలో పశువులు అడ్డుగా ఉండడం వలన చాలా ప్రమాదాలు జరిగాయి. వార సంత సమయంలో ఆదివారం రోజు సంత జరిగే ఆవరణం, రోడ్లపై పశువులు ఎక్కువగా ఉంటాయి. పశువుల యజమానులకు ఇచ్చిన గడువు కల్లా వాటిని వారి ఇళ్లకు తీసుకెళ్లకుంటే, గోశాలలకు తరలించి, యజమానులపై కూడా చర్యలు చేపట్టాలని వాహనదారులు అంటున్నారు.

పశువులు రోడ్లపైనే కాకుండా డివైడర్ల మధ్యలో ఉండడం ఒక్కసారిగా రోడ్డుపైకి రావడం వలన ప్రమాదాలు జరుగుతున్నాయి. ఏడాదిన్నర క్రితం పశువుల వలన రోడ్డు ప్రమాదం జరిగిన సమయంలో పశువుల యజమానులకు హెచ్చరికలు జారీ చేసి నోటీసులు ఇచ్చారు. కానీ ఎటువంటి చర్యలు తీసుకోలేదు. ద్విచక్ర వాహనదారులు పశువులు అడ్డురావడం వలన కింద పడి గాయాలతో బయటపడుతున్నారు. మున్సి పల్ అధికారులు వెంటనే చర్యలు తీసుకోవాలని స్థానికులు, వాహనదారులు కోరుతున్నారు.



హెడ్డాఫీసు సెంటర్ రోడ్డుపై తిష్టవేసిన పశువులు

చర్యలు తీసుకుంటాం..



రోడ్లపై పశువులు ఉండడం వలన రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయి. పశువుల యజమానులకు నోటీసులు జారీ చేసి, వారి ఇళ్లకు వాటిని తీసుకెళ్లకుంటే గోశాలలకు తరలిస్తాం. రోడ్లపైకి పశువులను విడిచిపెట్టడం వాహనదారులు ఇబ్బంది పడుతున్నారు. రోడ్లపైకి పశువులను వదలకుండా యజమానులు జాగ్రత్తలు తీసుకోవాలి.

– శేషాంజన్‌స్వామి, మున్సిపల్ కమిషనర్

డయాలసిస్ సెంటర్‌ను నడిపించాలి



మాట్లాడుతున్న నాయకులు

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణి ప్రధానాస్పత్రిలోని నెఫ్రోప్లస్ డయాలసిస్ సెంటర్‌ను పూర్తి సౌకర్యాలతో నడిపించాలని, డయాలసిస్ సిబ్బంది నిర్లక్ష్యం కారణంగా శుక్రవారం యాకూబ్‌ఖాన్ అనే ఇల్లెందు ఏరియా కార్మికుడు మృతి చెందారని ఏఐటీయూసీ ఆర్గనైజింగ్ సెక్రటరీ వంగా వెంకట్ అన్నారు. శనివారం ఆయన ఆస్పత్రి ఏసీఎంఓ విక్టర్ వందనంతో చర్చించారు. ఇక్కడ డాక్టర్ అందుబాటులో లేరని, స్ట్రెచర్, వీల్‌చైర్ అందుబాటులో లేకపోవడంతో క్యాజువాలిటీకి తరలించే సదుపాయం లేనందున ఆయన డయాలసిస్ సెంటర్‌లోనే మృతి చెందినట్లు చెప్పారు. మృతుడి కుటుంబానికి నష్టపరిహారం ఇవ్వాలని, ఈ సెంటర్ నిర్వాహకులను పిలిచి మాట్లాడాలని డిమాండ్ చేశారు. సానుకూలంగా స్పందించిన ఏజీఎంఓ సమస్య పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. వీరస్వామి, నాగేశ్వరరావు, ఎస్.శ్రీనివాస్, శాంసన్, లక్ష్మీనారాయణ, మధు కృష్ణ ఉన్నారు.

రిటైర్‌మెంట్ బెనిఫిట్లు ఇవ్వాలి



సూపర్‌బజార్(కొత్తగూడెం): దీక్ష చేస్తున్న అంగన్‌వాడీలు, హెల్పర్లు



ఇల్లెందురూరల్: ప్రదర్శన నిర్వహిస్తున్న అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు

సూపర్‌బజార్(కొత్తగూడెం): అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్ల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ సీఐటీయూ ఆధ్వర్యంలో శనివారం 65 సంవత్సరాలు నిండిన అంగన్‌వాడీలతో రిలే దీక్షలు చేపట్టారు. సంఘం జిల్లా అధ్యక్షుడు కె.బ్రహ్మాచారి దీక్షలను ప్రారంభించి మాట్లాడుతూ.. జీఓ 10 రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం ఇచ్చిన మాట తప్పినందుకు పోరాటబాట పట్టాల్సి వచ్చిందన్నారు. గతంలో అంగీకరించిన విధంగా బెనిఫిట్లు అందజేయాలని కోరారు. అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్లకు తక్కువ డబ్బులు చెల్లించి ఇంటికి పంపించే నిర్ణయాన్ని రాష్ట్ర ప్రభుత్వం ఉపసంహరించుకోవాలని కోరారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రి సీతక్క హామీలను నిలబెట్టుకోవాలని లేకపోతే పోరాటాన్ని ఉధ్రుతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో తెలంగాణ అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి జి.పద్మ, సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు దొడ్డ రవికుమార్, జిల్లా సహాయ కార్యదర్శి కె.సత్య, జిల్లా కమిటీ సభ్యుడు భూక్యా రమేష్, అంగన్‌వాడీ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు ఈసం వెంకటమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఇల్లెందురూరల్: అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలకు రిటైర్‌మెంట్ బెనిఫిట్లు చెల్లించాలని, జీఓ 10 రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ మండలంలోని సంజయ్‌నగర్‌లో సీఐటీయూ ఆధ్వర్యంలో అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు ప్రదర్శన నిర్వహించారు. సంఘం జిల్లా నాయకుడు అబ్దుల్ నబీ మాట్లాడుతూ.. ఉద్యోగ విరమణ పొందిన అంగన్‌వాడీ టీచర్లకు రూ.2లక్షలు, ఆయాలకు రూ.లక్ష అందజేస్తామని గత బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రకటించిందని గుర్తుచేశారు. కార్యక్రమంలో తాళ్లూరి కృష్ణ, మరియా, యాకమ్మ, సుభద్ర, మోహిని, ఆదిలక్ష్మి, మల్లికాంబ, విక్టోరియా, పద్మ, సుశీల పాల్గొన్నారు.

జగ్జీవన్‌రామ్ ఆశయాలు సాధిద్దాం..



పాల్వంచ: నివాళులర్పిస్తున్న కొత్వాల శ్రీనివాసరావు తదితరులు



జూలూరుపాడులో నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు

కొత్తగూడెంరూరల్: కొత్తగూడెం పట్టణంలోని బస్టాండ్ సెంటర్‌లోని బాబూ జగ్జీవన్‌రామ్ 117వ వర్ధంతి కార్యక్రమం శనివారం నిర్వహించారు. తొలుత ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అంబేద్కర్ సంక్షేమ సంఘం రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షుడు మద్దెల శివకుమార్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మందా హనుమంతు మాట్లాడుతూ.. జగ్జీవన్‌రామ్ ఆశయాల సాధనకు ప్రతీఒక్కరు కృషి చేయలన్నారు. ఈ కార్యక్రమంలో అల్లిశంకర్, మంద వెంకన్న, స్టీవెన్ లాజరస్, మందా సాంబయ్య తదితరులు ఉన్నారు.

జూలూరుపాడు: స్వాతంత్ర్య సమరయోధుడు, సంఘసంస్కర్త, మాజీ ఉప ప్రధాని డాక్టర్ బాబూ జగ్జీవన్‌రామ్ వర్ధంతిని కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో శనివారం జూలూరుపాడులో నిర్వహించారు. స్థానిక నవోదయ కాంప్లెక్స్ వద్ద జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో లేళ్ల వెంకటరెడ్డి, మాలోత్ మంగీలాల్ నాయక్, మధుసూదన్‌రావు, వేల్పుల నరసింహారావు తదితరులు పాల్గొన్నారు. ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో.. నిర్వహించిన కార్యక్రమంలో చెంగల గురునాథం, దిబ్బెందుల సాయికుమార్, చాపలమడుగు నరసింహారావు, కాకటి కృష్ణ, చెంగల నరసింహారావు, కాకటి నరేందర్, వెంకట్, విజయ్, ఉదయ్ పాల్గొన్నారు.

పాల్వంచ: దేశంలో సమసమాజ స్థాపనకు అహర్నిషలు కృషి చేసిన మహోన్నత వ్యక్తి బాబూ జగ్జీవన్‌రామ్ అని డీసీఎంఎస్ చైర్మన్, రాష్ట్ర మార్క్‌ఫెడ్ డైరెక్టర్ కొత్వాల శ్రీనివాసరావు అన్నారు. శనివారం జగ్జీవన్‌రామ్ వర్ధంతి సందర్భంగా స్థానిక బస్టాండ్ సెంటర్‌లో జగ్జీవన్‌రామ్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగాగా మాట్లాడారు. కార్యక్రమంలో బరపటి వాసుదేవరావు, ఎడవల్లి కృష్ణ, కొండెం వెంకన్న, మేదరమెట్ల వెంకటేశ్వర్లు, బద్ది కిశోర్, బత్తు వెంకటేశ్వరరావు, సాధం రామకృష్ణ, దండోర శ్రీను, కాల్వ భాస్కర్‌రావు, కొత్తపల్లి సోమయ్య, గొడ్ల మోహన్ రావు, శ్రీను పాల్గొన్నారు.

గెస్ట్ లెక్చరర్ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

కొత్తగూడెంరూరల్: లక్ష్మీదేవిపల్లి మండలం శ్రీరామ చంద్ర ప్రభుత్వ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో ఖాళీగా ఉన్న అతిథి అధ్యాపకుల పోస్టులను భర్తీ చేసేందుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ హవీలా శనివారం తెలిపారు. రాజనీతి శాస్త్రం, తెలుగు ఒక్కో పోస్టు ఖాళీగా ఉన్నాయని, పీహెచ్‌డీ, నెట్ లేదా సెట్‌లో 55 మార్కులు, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు 50 శాతం మార్కులు ఉండాలని సూచించారు. 8వ తేదీ లోపు దరఖాస్తు చేసుకోవాలని, 9న ఉదయం పది గంటలకు ఒరిజినల్ సర్టిఫికెట్లు, రెండు జిరాక్స్ సెట్లు, ధ్రువపత్రాలతో హాజరు కావాలన్నారు.

ఉద్యోగ భద్రత కల్పించండి..

జూలూరుపాడు: మిషన్ భగీరథ పైప్‌లైన్ ఆపరేటర్లకు ఉద్యోగ భద్రత కల్పించాలని, స్థానికేతరులను తొలగించాలని బీఎస్పీ మండల అధ్యక్షుడు తంబర్ల నరసింహారావు అన్నారు. ఈ మేరకు ఎంపీడీఓ కరుణాకర్‌రెడ్డిని శనివారం బీఎస్పీ నాయకులు కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో వెంకటరామారావు, రాము, శివ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో చేరిక

జూలూరుపాడు: సురారం గ్రామంలో పలు బీఆర్ఎస్ కుటుంబాలు కాంగ్రెస్ పార్టీలో చేరాయి. శనివారం గ్రామంలో జరిగిన కార్యక్రమంలో పార్టీ జిల్లా నాయకుడు లేళ్ల వెంకటరెడ్డి సమక్షంలో 15 కుటుంబాలు వారు హస్తం పార్టీలో చేరారు. వీరికి కాంగ్రెస్ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో మాలోత్ మంగీలాల్ నాయక్, దుద్దుకూరి మధుసూదన్‌రావు, వేల్పుల నరసింహారావు, బానోత్ ధర్మా, హతీరామ్, చింతా జగన్నాథం, మాలోతు రాములు, ధరావత్ భీముడు, మోతీలాల్, రోశయ్య పాల్గొన్నారు.

పెండింగ్ స్కాలర్‌షిప్ విడుదల చేయండి..



కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

సూపర్‌బజార్(కొత్తగూడెం): పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్, ఫీజు రీయింబర్స్‌మెంట్ వెంటనే విడుదల చేయాలని కోరుతూ శనివారం ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం(పీడీఎస్‌యూ) జిల్లా కమిటీ ఆధ్వర్యంలో కలెక్టర్ జితేష్ వి.పాటిల్‌కు వినతిపత్రం అందజేశారు. సంఘం జిల్లా కోశాధికారి జె.గణేష్ మాట్లాడుతూ... నూతన విద్యాసంవత్సరం ప్రారంభమై నెల కావొస్తున్నా రాష్ట్ర వ్యాపితంగా పెండింగ్‌లో ఉన్న రూ.6,700 కోట్ల స్కాలర్‌షిప్, ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను విడుదల చేయడం లేదని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడినప్పటికీ ఇప్పటి వరకు విద్యారంగానికి మంత్రిని కేటాయించక పోవడం నిర్లక్ష్యానికి నిదర్శనమన్నారు. కొత్త సీసాలో పాతసారా చందంగా కాంగ్రెస్ పాలన ఉందని ఎద్దేవా చేశారు. విద్యార్థుల బకాయిలు పెండింగ్‌లో ఉన్నందున ప్రైవేట్, కార్పొరేట్ యాజమాన్యాలు విద్యార్థులకు సర్టిఫికెట్లు ఇవ్వడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణమే సమస్యలు పరిష్కరించాలని లేదంటే ఉద్యమాలు చేపడతామని హెచ్చరించారు. పవన్‌కుమార్, పూజిత, నీహారిక తదితరులు పాల్గన్నారు.

పథకాల అమలు, పురోగతిపై సర్వే



వెంకట్యా తండా ఆరోగ్య ఉపకేంద్రం వద్ద సర్వే బృందంతో వైద్య సిబ్బంది

టేకులపల్లి: ప్రభుత్వ పథకాల పురోగతిపై టేకులపల్లి మండలంలో కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో సర్వే నిర్వహించారు. గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజల కుటుంబ, ఆర్థిక, ఆరోగ్య స్థితిగతులను క్షేత్రస్థాయిలో సర్వే చేశారు. నివేదికను భారత ప్రభుత్వానికి అందజేయడానికి సిగ్మా రీసెర్చ్ సంస్థ ప్రతినిధుల బృందం బేతంపూడి, వెంకట్యా తండా, నరసాయిగూడెం గ్రామాలలో మూడు రోజుల నుంచి సర్వే చేస్తున్నారు. ఈ కార్యక్రమంలో సిగ్మా రీసెర్చ్ జిల్లా కోఆర్డినేటర్ పవన్ కళ్యాణ్, సూపర్‌వైజర్ వర్ష, మహిళా ఇన్వెస్టిగేటర్స్ గీత, శివరాణి, ధరణి పురుషుల ఇన్వెస్టిగేటర్ శ్రీకాంత్, హెల్త్ ఇన్వెస్టిగేటర్స్ అభి , మౌనిక లు పాల్గొన్నారు . వీరికి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సులానగర్ కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ వజ్జా పార్వతి ఆధ్వర్యంలోని వైద్య బృందం సూపర్వైజర్ నాగు బండి వెంకటేశ్వర్లు , ఏఎస్ఎం లు ఎల్లమ్మ , లక్ష్మి ఆశా కార్యకర్తలు స్వరూప, శిరోమణి లు సహకారం అందించారు.

ఘనంగా సహకార దినోత్సవం



జూలూరుపాడు: జెండాకు వందనం చేస్తున్న చైర్మన్, డైరెక్టర్లు

జూలూరుపాడు: స్థానిక సొసైటీ కార్యాలయంలో శనివారం సహకార దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. సంఘం అధ్యక్షుడు చీమలపాటి భిక్షం సహకార జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో డైరెక్టర్లు యల్లంకి సత్యనారాయణ, లకావత్ హేమ్లా, చాపలమడుగు రామ్మూర్తి, పాపిన్ని వెంకయ్య, మనుబోలు తిరువెంగలరాజు, రజినీ, శీలంశెట్టి రామారావు, సొసైటీ సీఈఓ రమణారెడ్డి, సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

టేకులపల్లి: సహకార సంఘాల అంతర్జాతీయ 102వ వారోత్సవ వేడుకలు మండల కేంద్రంలోని బేతంపూడి సహకార సంఘం కార్యాలయంలో శుక్రవారం ఘనంగా జరుపుకున్నారు. సంఘం అధ్యక్షుడు లక్కినేని సురేందర్‌రావు సహకార సంఘం జెండా ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో సొసైటీ డైరెక్టర్లు గుడిపూడి కృష్ణార్జున్‌రావు, భూక్యా బాలాజీ, బానోతు ఇస్తారి, ఉల్లోజు ఉదయ్ చందర్, చీమల లక్ష్మీనారాయణ, సీఈఓ పొన్నోజు ప్రేమాచారి, కందుల వెంకటేశ్వర్లు, గురుమూర్తి, హుస్సేన్, హీరా తదితరులు పాల్గొన్నారు.

మొక్కలు నాటి సంరక్షించాలి



పాల్వంచరూరల్: మొక్క నాటుతున్న బీజేపీ నాయకులు



ఇల్లెందురూరల్: మొక్క నాటుతున్న అధ్యాపకులు, విద్యార్థులు

పాల్వంచరూరల్: పర్యావరణ సమతుల్యతను కాపాడాలంటే ప్రతీఒక్కరు మొక్కలు విరివిగా నాటి వాటిని సంరక్షించాలని బీజేపీ పట్టణ కోకన్వీనర్ బుడగం రవికుమార్ అన్నారు. రాష్ట్ర బీజేపీ పిలుపు మేరకు జన సంఘ వ్యవస్థాపకులు డాక్టర్ శ్యాంప్రసాద్ ముఖర్జీ జయంతిని పురస్కరించుకుని పార్టీ ఆధ్వర్యంలో శనివారం పట్టణంలోని శ్రీనగర్ కాలనీ, ఒడ్డుగూడెం కాలనీలో మొక్కలు నాటారు. దున్నపాతుల రాజు, వీరన్న, కాల్వ ప్రసాద్, తిరుపతయ్య, కాల్వ సుధాకర్, గంగపూరి శ్రీను, ప్రతాప్, బాలు గిరిగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలలో...

తోగ్గూడెం తండాలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల ప్రాంగణంలో వనమహోత్సవంలో భాగంగా శనివారం ఎంపీపీ మడివి సరస్వతి మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి రవికుమార్, వీఓ చైర్మన్ జరుపుల భద్రి, హెచ్ఎం రాంబాబు, ఉపాధ్యాయులు విజయమ్మ, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

డిగ్రీ కళాశాలలో వనమహోత్సవం

ఇల్లెందురూరల్: ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో శనివారం వనమహోత్సవంలో భాగంగా మొక్కలు నాటారు. ప్రిన్సిపాల్ డాక్టర్ పోలారపు పద్మ మాట్లాడుతూ.. ప్రతిఏటా కళాశాల ఆవరణలో మొక్కలను నాటి కళాశాలను పచ్చదనంతో అలంకరించుతున్నామని చెప్పారు. ప్రస్తుతం ఏక్ పేడ్ మా కే నామ్ అభియాన్‌లో భాగంగా మొక్కలు నాటామని వివరించారు. ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ తోడేటి రాజు, అధ్యాపకులు పాల్గొన్నారు.

వేలాన్ని అడ్డుకుంటేనే సింగరేణికి మనుగడ



సింగరేణి ప్రధాన కార్యాలయం వద్ద ఆందోళన నిర్వహిస్తున్న టీబీజీకేఎస్ నాయకులు



ఇల్లెందు: దీక్షలు ప్రారంభిస్తున్న ఏఐటీయూసీ నేతలు

సింగరేణి(కొత్తగూడెం): బొగ్గు బ్లాక్‌ల ప్రైవేటీకరణను అడ్డుకుంటేనే సింగరేణి సంస్థకు మనుగడ ఉంటుందని కోల్‌బెల్ట్ ప్రాంతాల యువతకు ఉపాధి అవకాశాలు లభిస్తాయని, సీపీఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కే సాబీర్‌పాషా, యూనియన్ అదనపు కార్యదర్శి మిర్యాల రంగయ్య అన్నారు. తెలంగాణలోని శ్రావణపల్లి బొగ్గు బ్లాక్‌లతోపాటు ఇతర బొగ్గు బ్లాక్‌లను వేలం వేసేందుకు కేంద్రం తీసుకున్న నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ సింగరేణి కార్మిక గుర్తింపు సంఘం సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో వారంరోజులపాటు జరపతలపెట్టిన రిలే నిరహార దీక్ష శిబిరాన్ని వారు శనివారం ప్రారంభించి మాట్లాడారు. మోదీ ప్రభుత్వం దేశ కార్పొరేట్ వ్యక్తులకు కట్టబెడుతోందని, ఇది పరోక్షంగా ఆర్థిక నేరానికి పాల్పడటమేనన్నారు. ప్రజలకు చెందాల్సిన బొగ్గు నిక్షేపాలు బడాబాబులకు కట్టబెడతామంటే చూస్తూ ఊరుకోబోమని, ప్రజా ఉద్యమాలతో మోదీకి బుద్ధి చెబుతామని హెచ్చరించారు. బొగ్గు వెలికితీతలో సుదీర్ఘ అనుభవం ఉన్న సింగరేణి సంస్థను కాదని, ప్రైవేట్ సంస్థలకు అప్పగించడం పరోక్షంగా సింగరేణి సంస్థను నిర్వీర్యం చేసే చర్యల్లో భాగమేనన్నారు. బొగ్గు గనుల వేలంపాటను నిరసిస్తూ చేపట్టిన వారం రోజుల నిరసన దీక్షలు విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో దమ్మాలపాటి శేషయ్య, వంగా వెంకట్, జి.వీరస్వామి, వి.మల్లికార్జున్‌రావు, ఎస్‌వీ రమణమూర్తి, జే.గట్టయ్య, రాము, క్రిష్టాఫర్, సందెబోయిన శ్రీనివాస్, ఎస్.నాగేశ్వరరావు, చంద్రయ్య, బండారు మల్లయ్య, నాగయ్య, భుక్యా దస్రు, కొమారి హన్మంతరావు, జక్కుల రాములు, గోపి, కృష్ణ, టి.లక్ష్మీనారాయణ, సునావత్ గోవిందు, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

టీబీజీకేఎస్ ఆధ్వర్యంలో...

తెలంగాణలోని బొగ్గు బ్లాకుల విషయంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ద్వంద్వ వైఖరిని వీడాలని, సింగరేణి సర్వే చేసిన బ్లాక్‌లను సింగరేణికే కేటాయించాలని డిమాండ్ చేస్తూ శనివారం కొత్తగూడెం ఏరియా జీఎం కార్యాలయం, సింగరేణి ప్రధాన కార్యాలయం ఎదుట టీబీజీకేఎస్ నాయకులు ధర్నాలు నిర్వహించి ఏరియా జీఎం శాలేంరాజు, కార్పొరేట్ జీఎం పర్సనల్ బీఆర్ దీక్షితులుకు వినతిపత్రాలు అందజేశారు. కాపు కృష్ణ, కాపు సీతాలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ఇల్లెందు: కేంద్ర ప్రభుత్వం బొగ్గు బ్లాకుల వేలం నిలిపివేయాలని, నాలుగు బొగ్గు బ్లాక్‌లను సింగరేణి సంస్థకు కేటాయించాలని ఏఐటీయూసీ డిమాండ్ చేసింది. శనివారం ఇల్లెందులోని జీఎం కార్యాలయం ఎదుట సీపీఐ, ఏఐటీయూసీ, సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో రిలే దీక్షలను బ్రాంచి కార్యదర్శి నజీర్ అహ్మద్, బంధం నాగయ్య ప్రారంభించి మాట్లాడారు. తెలంగాణ ప్రభుత్వానికి 51 శాతం, కేంద్రానికి 49 శాతం ఈక్విటీ వాటా ఉందన్నారు. బొగ్గు బ్లాక్‌లను అమ్మకానికి పెట్టి సింగరేణి సంస్థను దివాళా తీయించటం తగదన్నారు. ఈ కార్యక్రమంలో దాసరి రాజారామ్, దేవరకొండ శంకర్, సంజీవచారీ, జయరాజ్, బొల్లి కొమురయ్య, కౌన్సిలర్ కుమ్మరి రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

జీఎం కార్యాలయం ఎదుట ఆందోళన...

కేంద్రం బొగ్గు బ్లాకుల వేలంను రద్దు చేయాలని టీబీజీకేఎస్, బీఆర్ఎస్ డిమాండ్ చేసింది. శనివారం ఇల్లెందు జీఎం కార్యాలయం ఎదుట ఆందోళన నిర్వహించి వినతిపత్రం అందజేశారు. టీబీజీకేఎస్ ఉపాధ్యక్షులు జాఫర్ హుస్సేన్, బీఆర్ఎస్ నాయకులు దిండిగల రాజేందర్ మాట్లాడారు. తక్షణం బొగ్గుశాఖ మంత్రి కిషన్‌రెడ్డి ప్రధానితో చర్చించి వేలంను విరమించుకోవాలని కోరారు. సత్యనారాయణ, కిష్టయ్య, తోట లలిత శారద, అబ్దుల్ నబీ, వాసూ, రవి, చాంద్‌పాషా, పోషం, గిన్నారపు రాజేష్, శివ, ఘాజీ పాల్గొన్నారు.